క్లుప్తంగా

ఘనంగా దత్తాత్రేయ జయంతి



యడ్లపాడు: మండలంలోని కొత్త సొలస గ్రామంలోని శ్రీషిర్డీసాయి మందిరం భక్తులతో కళకళలాడింది. దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఆలయంలోని దత్తాత్రేయస్వామి వారికి అర్చకుడు నారాయణం లక్ష్మణాచార్యులు విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అష్టోత్తర శతనామావళి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలు రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం




నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన దొడ్డ రఘురామిరెడ్డి, శాంత కుమారి దంపతులు రూ.లక్ష విరాళంగా అందచేశారు. ఆలయ కార్యాలయంలో ఈఓ నలబోతు మాధవిదేవిని కలిసి విరాళం చెక్‌ను దాతలు అందించారు. ఆలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందించి సహకరించాలని ఈ సందర్భంగా ఈఓ కోరారు.

గీతమ్స్‌లో నవోదయ మోడల్ టెస్ట్



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని సిద్ధార్థ నగర్‌లో గల గీతమ్స్ హైస్కూల్‌లో ఆదివారం గీతమ్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నవోదయ ఎంట్రన్స్ టెస్ట్ (మోడల్ గ్రాండ్ టెస్ట్) నిర్వహించారు. ఎంఈఓ జప్రుల్లా పాల్గొని ప్రశ్నాపత్రాన్ని విడుదల చేసి మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి పరీక్షలు రావడం వల్ల మేధాశక్తి రెట్టింపు అవుతుందన్నారు. ప్రిన్సిపాల్ కృష్ణవేణి, కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి, రవీంద్ర సుభాని, శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, రంగనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి పుష్పయాగం



చిలకలూరిపేట: మండలంలోని చినపసుమర్రులో ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామికి ధనుర్మాసం మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం పుష్పయాగం నిర్వహించారు. ఆలయ అర్చకులు పావులూరి లక్ష్మణ, వింజనంపాటి సాయి కృష్ణశర్మ, పరుచూరి శేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వెలంపల్లి రవిశంకర్, మేనేజర్ జగన్‌మోహనరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ డే జయప్రదం చేయండి



వినుకొండ(నూజెండ్ల): స్థానిక నరసరావుపేట రోడ్డులోని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం భవనంలో ఈ నెల 17న పెన్షనర్స్ డే, 17వ వార్షిక సమావేశం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ డే కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జి.కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, వీరరాఘవయ్య, సుబ్బయ్యశర్మ, నాగేంద్రుడు పాల్గొన్నారు.

వసతి గృహమా.. పశువుల కొష్టమా?

- తలుపులు లేని మరుగుదొడ్లు
- గది తలుపులకు బదులు దుప్పట్లు
- రాత్రిళ్లు పాములు.. పగలు గేదెల సంచారం
- అధ్వాన పారిశుద్ధ్యం
- మెనూకు మంగళం
- తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు
- విద్యకు దూరం అవుతున్న పేద విద్యార్థులు
- నూజెండ్ల బీసీ బాలుర వసతి గృహంలో దుస్థితి



ప్రహరీ లేకుండా అధ్వాన పారిశుద్ధ్య పరిస్థితిలో ఉన్న బీసీ బాలుర వసతి గృహం

వినుకొండ(నూజెండ్ల): మండల కేంద్రం నూజెండ్లలోని బీసీ బాలుర వసతి గృహంలో వసతులులేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి చదువుకోవటానికి వచ్చిన పేద విద్యార్థులు అసౌకర్యాలతో పాటు ఆకలి బాధలతో అగచాట్లు పడుతున్నారు. హాస్టల్ నిర్వహణలో అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో కొరవడటంతో పాటు వార్డెన్ సైతం ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించటంతో సమస్యలకు నిలయంగా మారింది. దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది.



తలుపులు లేని మరుగుదొడ్లు

పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారు.

గదులకు తలుపులుగా దుప్పట్లు..

వసతి గృహం భవనం కూడ శిథిలావస్థకు చేరటంతో పాటు మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. తలుపులు లేని మరుగుదొడ్ల వలన బహిర్భూమికి విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. గదులకు తలుపులు లేక దుప్పట్లు కట్టుకుంటూ, చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహానికి ప్రహరీ లేకపోవటం వలన ఆవరణలో రాత్రిళ్లు విషసర్పాలు సంచరిస్తున్నాయి. పగలు గేదెలు ఇష్టానుసారంగా తిరుగుతున్నాయి. చిన్నపాటి వర్షానికే హాస్టల్ భవనం కారుతుందని విద్యార్థులు వాపోతున్నారు. మెనూ కూడ పాటించకపోవటం చేత విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి వసతి గృహ సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టి వాటిని తొలగించాలని, వార్డెన్‌ను నియమించి కష్టాలు తొలగించి, వారు విద్యకు దూరం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

అగచాట్లు పడుతున్నాం..



వసతులు లేకపోవటం వలన అగచాట్లు పడుతున్నాం. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవటం వలన ఇబ్బందులు పడుతున్నాం. వర్షం కాలం అయితే లీకుల వల్ల రాత్రిపూట మేల్కొని ఉండాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వం స్పందించి వసతి గృహంలో సదుపాయాలు ఏర్పాటు చేయాలి.

– ఆనంద్, 6వ తరగతి

ప్రాణభయంతో బతుకుతున్నాం



మాలాంటి పేద విద్యార్థులు విద్యకు దూరం కాకుండా ఉండటానికి ప్రభుత్వం వసతి గృహం ఏర్పాటు చేసింది. వసతులు సక్రమంగా లేకపోవటం వలన అగచాట్లు పడుతున్నాం. ప్రహరీ లేకపోవటం వలన రాత్రి పూట విషసర్పాలు తిరుగుతున్నాయి. ప్రాణభయంతో బతుకుతున్నాం. ప్రభుత్వం అధికారులు తక్షణమే స్పందించి వసతి గృహంలో వసతులు మెరుగుఅయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– నాగరాజు, 8వ తరగతి

యోగా సాధనతో మనస్సు ప్రశాంతం



అభ్యాసకులకు జ్ఞాపికలు అందజేస్తున్న యోగాచార్యుడు శ్రీనివాసరావు, అతిథులు

నరసరావుపేట ఈస్ట్: ఉత్తమ జీవనానికి యోగా సాధనమని మంగళగిరి శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం ప్రధానాచార్యులు డాక్టర్ వేంకటేశ్వర యోగి గురూజీ తెలిపారు. యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో 28 రోజుల పాటు నిర్వహించిన 181వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆదివారం ప్రకాష్‌నగర్‌లోని మాగులూరి బిల్డింగ్ అక్షర పాఠశాల ఆవరణలో ఆనందోత్సవం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న అభ్యాసకులనుద్దేశించి డాక్టర్ వేంకటేశ్వర గురూజీ మాట్లాడుతూ, ఓంకారంతో మొదలయ్యే యోగ సాధనతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని వివరించారు. అసూయ రాగద్వేషాలకు అతీతంగా పాపకర్మలను విడనాడి సత్కర్మలను చేయటం అలవడుతుందని వివరించారు. అభ్యాసకులు ప్రతిరోజు శిబిరంలో తాము నేర్చుకున్న ఆసనాలు, ధ్యానం, ప్రాణాయామంను ఆచరించాలని తెలిపారు. శిబిరానికి పూర్తిస్థాయిలో హాజరైన వారికి బోధక యోగాచార్యుడు జల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అతిథులు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ కృష్ణప్రసాదు, స్వామి స్కూల్ డైరెక్టర్ ఈ.ఎం.స్వామి, మాగులూరి రమణారెడ్డి, వెంగళరెడ్డి, మేళ్లచెరువు వీరాంజనేయులు, చిలకలూరిపేట శాఖ బోధనాచార్యులు కాపుగంటి శివప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన



విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకుడు మహేష్, గ్రామస్తులు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అన్నారు. సత్తెనపల్లి మండలంలోని రెంటపాళ్ల గ్రామంలో విద్యుత్ చార్జీల పెంపుపై ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం రూ.8,114 కోట్ల ట్రూ అప్ చార్జీల భారం మోపేందుకు సిద్ధమైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్‌పై శ్వేతపత్రం ప్రకటించాలన్నారు. గతంలో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు అదనంగా బిల్లులు కట్టేలా సర్దుబాటు చార్జీల పేరుతో వసూలు చేపట్టడం దుర్మార్గమన్నారు. ఇదే కాకుండా మరో రూ.20 వేల కోట్లు ప్రజలపై భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. వెంటనే విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపేలా తీసుకున్న చర్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. చార్జీలు తగ్గించే వరకు ఉద్యమిస్తామన్నారు. ఈ సందర్భంగా రెంటపాళ్లలోని రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్ బిల్లులను తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దుగ్గి మేరమ్మ, జె.భగత్, బి.రామారావు, పార్టీ నాయకులు దుగ్గి నాగేశ్వరరావు, అనూష, సుజాత, లక్ష్మణరావు, నాగార్జున, గణేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న హెల్ప్ హాస్పిటల్ వైద్యులు

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు జెడ్పీ హైస్కూలు ఆవరణలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మాదిపాడు, గింజుపల్లి, గింజుపల్లి తండా, కుంటిమద్ది, జడపల్లిమోటు తండా, కంచుబోడుతండా తదితర ప్రాంతాల నుంచి రోగులు భారీ సంఖ్యలో తరలి వచ్చి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ముఖ్యంగా చాతి, గుండె నొప్పి, గ్యాస్ సమస్యలతో బాధపడేవారికి ఉచితంగా బీపీ, ఈసీజీ, ఎకో టెస్టులు నిర్వహించారు. యాంజియోగ్రామ్, స్టంట్స్, శస్త్ర చికిత్సలు అవసరమైనవారిని గుర్తించి విజయవాడ హెల్ప్ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. సుమారు 150 మందికి వైద్య సేవలు అందించి బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాదా ఈశ్వరమ్మ, మాదా వెంకట్రావు, మాజీ సర్పంచ్ కొరివి వెంకట్రామయ్య, ఎంపీటీసీ రమేష్ సీతాభాయ్, మాజీ ఎంపీపీసీ తుమాటి సత్తయ్య, ఆర్యవైశ్య సంఘ నాయకులు దేవరశెట్టి శ్రీనివాసరావు, ఆర్ఎంపీ వైద్యులు షేక్ కరిముల్లా, దావేదు పాల్గొన్నారు.

చర్చికి రూ.50 వేలు వితరణ

క్రోసూరు: సెమీ క్రిస్మస్ సందర్భంగా వట్టి చెరుకూరు ఎంపీపీ చిలక సుబ్బారావు ఆదివారం వేల్పూరు లూథరన్ చర్చికి రూ.50వేలు విరాళమిచ్చారు. చర్చి ఫాదర్, సంఘపెద్దలు, చిలక ఇంటి పేరుగల పెద్దలతో కలిసి చర్చి నిర్మాణానికి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిలక సుందరరావు, రాంబాబు, లక్ష్మయ్య, రామయ్య, జాన్సన్ సుధాకర్, నాగరాజు, మరియదాసు, ప్రకాశం, యోహాను, నాగేశ్వరరావు పాల్గొన్నారు. క్రైస్తవులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. హాజరైన అతిథులందరికీ చర్చి ఫాదర్ జ్ఞాపికలు అందజేశారు.

పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



సహకారశాఖ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న డీసీఏఓ శ్రీనివాసరావు

వినుకొండ(నూజెండ్ల): పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గల ఆయన విగ్రహానికి ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమరణ దీక్షతో ఆంధ్రరాష్ట్రం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో గుడివాడ చిన్నగురునాథరావు, ఎం. నరసింహారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ రవి, జూనియర్ అసిస్టెంట్ నరేంద్రవర్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ ప్రభాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్షచేసిన గొప్ప త్యాగమూర్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని సీపీఎం నాయకుడు మానుకొండ రామారావు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. వై.సంజీవరావు, దేసు మణికంఠ, కోటి, వి.మల్లికార్జునరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత పొట్టి శ్రీరాములు..

చిలకలూరిపేట: తరతరాలకు తరగని స్ఫూర్తినిచ్చిన ధన్యజీవి అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఆదివారం నివాళులు అర్పించారు. అనంతరం ఆర్యవైశ్య కళ్యాణ మండప ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు(శావల్యాపురం): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు మండల కేంద్రం ఈపూరులోని గ్రంథాలయ శాఖ నిర్వాహకుడు జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలల వేసి నివాళి అర్పించారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో గల పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్‌లో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పొట్టి శ్రీరాములు జీవిత అంశాలపై క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ర వినాయక్ తెలిపారు. అదేవిధంగా రొంపిచర్లలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు పసుమర్తి ఆదినారాయణ, పడాల భాస్కరరెడ్డి, రాంబాబు, పంచాయతీ సెక్రటరీ నాగేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం జరిగింది. షేక్ లాలూదాదా సాహెబ్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేశారు. ఆయా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి అధ్యక్షుడు షేక్ కరిముల్లా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జీవితం ఎందరికో ఆదర్శం అన్నారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం అసువులు బాసిన త్యాగధనుడన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపం కార్యదర్శి చేవూరి కృష్ణమూర్తి, వైఎంసీఏ అధ్యక్షుడు డాక్టర్ చుక్కా విన్సెంట్ పాల్, మహాకవి జాషువా సిద్ధాంత భూమిక అధ్యక్షుడు దారా కొండయ్య, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, గ్రంథాయల ఇన్‌చార్జి డి.వీర్రాజు, సిబ్బంది సరోజిని, సాంబిరెడ్డిపాల్గొన్నారు.

జిల్లా సహకారశాఖ కార్యాలయంలో..

నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్‌లోని పల్నాడు జిల్లా సహకార శాఖ అధికారి కార్యాలయంలో ఆదివారం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి డీసీఏఓ దేవిశెట్టి శ్రీనివాసరావు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి సాధించారన్నారు. ఆంధ్రుల ప్రయోజనాల కోసమే ప్రత్యేక రాష్ట్రం ఉద్యమాన్ని చేపట్టి అశువులు బాసిన శ్రీరాములు అమరులు అన్నారు. తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు. రాంబాబు, రమేష్, రహీమ్, కార్యాలయం, ప్యాక్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరాధనోత్సవాలు



రొంపిచర్ల: మండలంలోని సుబ్బయ్యపాలెం గ్రామంలో శనివారం రాత్రి గంటా రామాలక్ష్మయ్య 23వ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామభక్తుడైన రామలక్ష్మయ్య ఆరాధన కార్యక్రమాలు నిర్వహించటం సుబ్బయ్యపాలెం గ్రామంలో ఆనవాయితీ. గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉత్సవాల్లో పాల్గొన్నారు. రాత్రివేళ ఆంజనేయస్వామి పల్లకి గ్రామోత్సవం నిర్వహించారు. వందలాది మందికి ఉచిత అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం తగదు

వినుకొండ(నూజెండ్ల): గురుకుల పాఠశాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గల మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాన్లు లేవని, భోజనం సక్రమంగా లేదని, టాయిలెట్స్ అధ్వానంగా ఉన్నాయని, మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. స్పందించిన జీవీ జిల్లా అధికారులకు ఫోన్ ద్వారా సమస్యను వివరించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



దాసునాయన మఠంలో పౌర్ణమి వేడుకలు

నాదెండ్ల: గణపవరం సినిమా హాలు సెంటర్‌లోని ఆంజనేయ ఉపాసకులు అచల దాసునాయన మఠంలో ఆదివారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆధ్యాత్మిక గురువులు ప్రసంగం చేశారు. అనంతరం ఆయా గురువులను మఠాధిపతి కటారు దాసునాయన శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం వరకూ స్వామివారి కీర్తనలు, భజనలు నిర్వహించారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

యడ్లపాడు: పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఎస్‌ఐ వి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొండవీడు గ్రామంలో కోతముక్కల ఆట కొనసాగుతుందని పోలీసులకు అందిన సమాచారంతో దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.9,880 నగదును స్వాధీనం చేసుకున్నారు.





ఓవరైంది..చూడండి



అచ్చంపేట ప్రధాన వీధిలో పట్ట కప్పకుండా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

అచ్చంపేట: ఓవర్ లోడుతో వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం పట్టలు కూడా కప్పకపోవడంతో.. ఇసుక రేణువులు గాలికి ఎగిరి ట్రాక్టర్ వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో పడుతున్నాయి. దీంతో వారు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అధిక లోడు ఇసుకతో ప్రధాన రహదారిలో వేగంగా ట్రాక్టర్లు వెళ్తున్నాయి. ట్రక్కు ఇసుకపై కనీసం పట్టాలు కప్పించాలన్న ఆలోచన కూడా అధికారులు చేయకపోవడం దురదృష్టకరం. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.